## జనవరి నెల భావపరిచయ పోటీ

## బహుమానం రూ. 25-00




ఈ కార్టూనుకు హాస్యయుత వ్యాఖ్య (Caption) కావాలి.

*గమనిక :* వ్యాఖ్యలు పోస్టుకార్డుపై వ్రాసి జనవరి 15వ తేదీలోగా పంపాలి

## డిసెంబర్ నెల భావపరిచయ పోటీ

## రు. 25-00 బహుమతి పొందిన వ్యాఖ్య

'అది చూస్తే చిత్రం!

ఇది చూస్తే విచిత్రం!!'

—చక్రవర్తుల వెంకటేశ్వరరావు

కాకినాడ-1.

తొట్టూరు నాగేశ్వరరావు — ఆధునిక నీతికథలు

"సువర్ణా!"

బెడ్‌రూమ్‌లోకి వచ్చి పిల్చాడు ఆనంద్.

నిర్మల్ డెకలాం డబుల్‌కాట్ డన్‌లప్ బెడ్‌పైన డబుల్ పిల్లోపై హారిజాంటల్‌గా పడుకొని 'కాస్మోపాలిటన్' మ్యాగజైన్‌లో లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్ చూస్తోన్న సువర్ణ 'వాట్?' అన్నట్టు చూసింది అప్‌కమింగ్ ఇండస్ట్రియలిస్ట్ అయిన భర్తకేసి.

"ఇవాళ లోక్‌సభ ఎలక్షన్లు కదా! వోటు వేసివద్దాం రా!" అన్నాడు ఆనంద్.

"ఎక్కడ?"

"పోలింగ్ బూత్‌లో."

"అదే! ఎక్కడ?"

"గవర్నమెంట్ ఎలిమెంటరీ స్కూల్లో. రెండు ఫర్లాంగుల దూరముంటుంది. కారులో వెళ్ళి పోల్‌చేసి వద్దాం."

"బోర్ డియర్!"

"బోర్ అంటే ఎట్లా సువర్ణా? వోటు వేసే అవకాశం అయిదేళ్ళకుగానీ రాదు. వోటు హక్కును వినియోగించుకొనే కర్తవ్యం ప్రతి పౌరునిపైనా వుంటుంది. అది ధర్మం కూడానూ. దానికే బోర్ అంటే ఎలా? మనకు నచ్చిన ప్రతినిధిని ఎన్నుకోవడం మన విధి."

"మీ రెళ్ళండి. నాకు ఈ ఎన్నికలన్నా, వోట్ పోల్‌చేయడమన్నా ఇంటరెస్టు లేదు. అక్కడ 'క్యూ'లో నిలబడాలి. ఆ 'క్యూ'లో రకరకాలవాళ్లు నిలబడతారు. మన పనిమనిషో, కోటమాలో, రోడ్లు వూడ్చేవాడో నిలబడతారు. వాళ్ళతో పాటు క్యూలో నిలబడటం నా డిగ్నిటీకి ఇన్సల్ట్. మీకంత ఇంటరెస్టుగా వుంటే మీరెళ్ళి పౌరధర్మాన్ని నెరవేర్చి రండి" అంది సువర్ణ పక్కనున్న టేప్‌రికార్డర్‌ను ఆన్‌చేస్తూ.

పదిహేను లక్షల రూపాయలు కట్నంగా తెచ్చిన సువర్ణ అయిష్టతను ఇష్టంగా మార్చడానికి ప్రయత్నం చేయలేదు ఆనంద్. అరిస్టోక్రాటిక్ జీవితా

లకు అలవాటుపడ్డ ఆడవాళ్ళ మనస్సుల్ని మార్చడం అసంభవమని అతను వెళ్ళిపోయాడు, నడిచివెళ్ళి తన వోటును పోల్‌చేసి వచ్చాడు.

వోట్ పోల్‌చేయడం 'బోర్' అని తుస్కారంగా భావించిన సువర్ణ సాయంత్రం మూడున్నరకు పెరల్‌వైట్ అమెరికన్ ప్రింటెడ్ జార్జెట్ నైలాన్ చీర ధరించి, పావుగంటసేపు అత్యాధునికంగా అలంకరణ చేసుకొని, క్లోజ్ ఫ్రెండ్ కళ్యాణితో పోలింగ్ స్టేషనుకు బయలుదేరింది, బ్లూకలర్ మారుతీ డీలక్స్ కారులో.

ఆమె ప్రవర్తన ఆశ్చర్యంగా తోచినా ఆమె 'మూడ్'ను చెడగొట్టటానికి ఇష్టంలేక చిరునవ్వు మినహా ఏమీ వ్యాఖ్యానం చేయలేదు.

సువర్ణా, కళ్యాణీ—ఇద్దరూ పోలింగ్‌స్టేషన్‌కు బయల్దేరారు. కల్యాణి బలవంతంమీదనే తన భార్య వోటు చేయడానికి సిద్ధపడిందని గ్రహించాడు ఆనంద్.

పది నిముషాల్లో ఇద్దరూ తిరిగివొచ్చారు.

హాల్లో మ్యాగజైన్ చదువుతూ సోఫాలో కూర్చునే ఉన్నాడు ఆనంద్.

"ఏమైంది? వోటు పోల్‌చేశావా సువర్ణా?"

"నేను చేశానండీ. కానీ...." అంది కళ్యాణి.

ఉప్పుమీద నిప్పుగల్లు పడ్డట్టుగా వుంది సువర్ణ మొహం. ఫారిన్ కాస్మొటిక్సులో మేకప్ చేసుకున్న ఆమె మొహం ఎండదెబ్బ తగిలిన తెల్లగులాబీలా వుంది.

"డర్టీ వరల్డ్, డర్టీ పాలిటిక్స్. డర్టీ టాక్టిక్స్. ఏం డెమొక్రసీ? ఏం ప్రజలు? అంతా మోసం; దగా! వోటు వేద్దామని వెళితే నా ఓటు పొద్దునే ఎవరో వేసేశారట. వాట్ ఏ వండర్‌ఫుల్ జోక్!" అంది సువర్ణ చిటపటలాడుతూ.

"అందుకే ఉదయం పది గంటలకు వోట్ చేద్దామన్నాను. నా మాట వినిపించుకున్నావు కాదు" అన్నాడు ఆనంద్ ముసిముసిగా నవ్వుతూ.

*వోటు వేయడంలో మీ కర్తవ్యాన్ని మీరు విస్మరిస్తే మరొకరు నెరవేర్చే ప్రమాదం లేకపోలేదు.*

# అనుభూతి

"నేను చాలా అలసిపోయాను" అరవై ఏళ్ళ వయసులో కాశీవిశ్వనాధం గారు అలసటగా అనుకున్నారు. ఒక్కసారి గతాన్ని వెనక్కి తిప్పి చూసుకుంటే ఎన్ని కలల అలలు. క్షణం తీరిక లేదు. చేసిన పనీ లేదు. ఆఫీసు ఇల్లు ఈ రెండిటి మధ్యా పరుగులు.

పుట్టిన తర్వాత కొద్దికాలం బాల్యం. అదో అనుభూతి. తండ్రి లాలింపు, ఆయన ముద్దు పెట్టుకుంటున్నప్పుడు మీసాలు గుచ్చుకున్నట్లు అదో గిలిగింత. తల్లి చల్లని వెన్నెలలా చిరునవ్వు నవ్వుతూ ఉండేది. "నాయినా కాశీ" ఆవిడ పిలుపు ఎప్పుడూ ఆప్యాయతా అనురాగం మేళవించేది. కళ్ళనిండా కాటుక, పసుపు రాసిన మొహానికి నిండైన రూపాయి కాసంత కుంకుమ బొట్టు. కళగల మొహం. దయగల చూపు, గంభీరమైన ప్రవర్తన. వయసులో కూడా కచ్చగోచీ పోసి, ఏడు గజాల చీరకట్టి కాళ్ళకు కడియాలూ, గొలుసులూతో పూర్వకాలపు ముత్తయిదువ. తులసెమ్మ గారంటే అందరికీ భక్తి గౌరవం. తండ్రి పోయాడని తెలిసిన మరుక్షణం స్పృహ తప్పిందావిడకి. తరువాత కొద్దిసేపటికి కళ్ళు తెరిచి "కాశీ నాయినా కాశీ" అంది. ఆవిడ కళ్లు ఏవో చెప్పబోయాయి. చెయ్యి అతని జుట్టు నిమిరి శూన్యంలోకి చూస్తూ కళ్ళు మూసింది. ఆ మూసిన కళ్ళు మళ్ళీ విప్పలేదు.

ఈ అనుభూతికి అర్థంలేదు అనుకునే వారు కాశీ విశ్వనాధంగారు. తల్లితండ్రుల అనురాగవర్తన్యాన్ని భార్యాభర్తల సహజీవనాన్ని మరో అర్థం చెప్పింది ఆయన ఇల్లాలు. ఆవిడ కొంచెం కారం పాలు ఎక్కువ ఉన్నమనిషి. ఆయన్ని ఎప్పుడూ ఆవిడ కోరికలకే ఉపయోగించుకుంది. కాని ఆయన కోరికలెన్నడూ ఆవిడ తీర్చలేదు.

తాసీల్దారు చేసేవాడాయన. కాని తాసీల్దారీగిరి చేసిందావిడే. ఆయనంటే ఎవరూ గుర్తించేవారుకాదు. రావణాసురమ్మ అని సణుక్కునేవారు మహాలక్ష్మి గురించి జవాన్లు. ఓసారి ఆయనెందుకో నోరెత్తాడు. మూడురోజులు పణిగి నాలుగో రోజు నూతిలో దూకుతానని కూర్చుందావిడ. కాళ్లు పట్టుకోవడం తప్పించి మిగతా ఉపచారాలన్నీ చేశాక విరమించుకుంది. ఆనాటినుంచీ విశ్వనాధాన్ని ఒకరకమైన నిర్లిప్తత ఆవరించింది. ఆయనలో ఒకరకమైన వేదాంతభావం

రచన: నందుల వెంకటేశ్వరరావు